ఆశాజనకంగా మినుము దిగుబడి

ప్రారంభమైన మినుము నూర్పిళ్లు


మినుము పంటను నూర్చుతున్న రైతులు

పామర్రు: మినుము నూర్పిడిలో రైతులు బిజీబిజీగా ఉంటున్నారు. నియోజకవర్గంలో మొత్తం 82 వేల ఎకరాల సాగు భూమి ఉండగా వీటిలో సుమారు 80 వేల ఎకరాల్లో మినుము సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు 50 వేల ఎకరాల్లో మినుము తీత పనులు జరిగాయి. సుమారు 20 వేల ఎకరాల్లో పంట నూర్పిళ్లు జరిగాయి. మండల పరిధిలో 24 వేల ఎకరాల్లో సాగు భూమి ఉండగా 20వేల ఎకరాల్లో మినుము సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకూ సుమారు 30శాతం వరకూ కాయ తీత పనులు పూర్తి చేశారు. రైతులు కాయ నూర్పిళ్లకు సన్నద్ధమవుతున్నారు.

పంట కళకళ

ఈ ఏడాది మినుము పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు అంటున్నారు. ఎకరానికి 5 నుంచి 6 బస్తాల వరకు దిగుబడులు వచ్చే అవకాశాలున్నాయని పేర్కొంటున్నారు. ఈ ఏడాది మినుము పంటకు ఎకరానికి రూ.5 నుంచి 6 వేల వరకూ ఖర్చైందని, దిగుబడులు బాగా ఉండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మినుము పంటకు గిట్టుబాటు ధర రూ.7,500 ప్రభుత్వం కల్పించడంతో రైతులు మినుము పంట నూర్పిళ్లు చేస్తున్నారు. మినుము సాగులో ఈ ఏడాది అంతగా తెగుళ్లు లేక పోవడంతో పంట కళకళలాడుతోంది.

దిగుబడులు బాగున్నాయి



ఈ ఏడాది మినుము పంట బాగా పండింది. దీనికి కారణం సకాలంలో సాగుకు నీరు అందించడంతో పాటు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడమే. వాతావరణం అనుకూలంగా ఉండటంతో పంట ఏపుగా పెరిగింది. ఎకరానికి 6 నుంచి 7 బస్తాల వరకు పండే అవకాశాలు ఉన్నాయి.

–మర్రెడ్డి అంజిరెడ్డి, రైతు పామర్రు

తెగుళ్లు తక్కువే



ఈ ఏడాది మినుము పంటకు తెగుళ్లు చాలా తక్కువ దశలో ఉన్నాయి. దీంతో పంటకు పురుగు మందుల వాడకం తగ్గింది. వాతావరణం కూడా సహకరించడంతో దిగుబడులు బాగా వచ్చే అవకాశాలు ఉన్నాయి.

– దుర్గానాగమల్లేశ్వరరావు, రైతు, జమీదగ్గుమిల్లి

క్లుప్తంగా

వేగంగా సచివాలయ నిర్మాణం



పామర్రు: స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద సచివాలయ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్లను దీనిలో ఏర్పాటు చేయనున్నారు. సుమారు రూ. 65 లక్షల వ్యయ అంచనాతో భవన సముదాయాన్ని నిర్మించారు. ప్రస్తుతం భవనం మెరక పనులు చేస్తున్నారు. ఇవి పూర్తయిన తర్వాత సచివాలయ భవనాన్ని ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నామని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

కొండలమ్మకు మొక్కుబడుల చెల్లింపు



గుడ్లవల్లేరు: కొండలమ్మ సన్నిధిలో భక్తుల సందడి నెలకొంది. వారు తమ మొక్కుబడులను చెల్లించడానికి ఆదివారం పెద్ద సంఖ్యలో ఆలయానికి విచ్చేశారు. మహిళలు పాలపొంగళ్లు సమర్పించారు. ఏర్పాట్లను ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి పర్యవేక్షించారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

గుడివాడటౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు మల్లంపల్లి వెంకట్రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నందివాడ మండలం జనార్ధనపురంలోని గీతామందిరంలో సోమవారం ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని గుండె, జీర్ణాశయం, ఎముకలు, కంటి, దంత, జనరల్ వ్యాధులకు పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు.

నేటి నుంచి గంగానమ్మ సంబరాలు



పామర్రు: స్థానిక గంగానమ్మ ఆలయంలో సోమవారం నుంచి వార్షిక జాతర ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేశారు. క్యూలైన్లు ఏర్పాటు చేశారు. సోమవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారి జాతర ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ చైర్మన్ బొమ్మారెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు. సీసీ కెమెరాలను అమర్చామని పేర్కొన్నారు. ఇక్కడ ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు బాల సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, బి.రాజశేఖర్‌రెడ్డి, జి.చంద్రశేఖరరెడ్డి, ఎం.అంజిరెడ్డి, బి.శ్రీనివాసరెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

టైలర్స్‌డేను జయప్రదం చెయ్యండి

గుడివాడటౌన్ : ఈనెల 28న జరగనున్న టైలర్స్ డే వేడుకలు విజయవంతం చెయ్యాలని టైలర్స్, వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు లంకపల్లి లాజరు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మంగళవారం ఉదయం టైలర్స్ స్ట్రీట్‌లో జెండా ఆవిష్కరణ ఉంటుందని అక్కడ నుంచి ఊరేగింపుగా స్థానిక ఎన్జీఓస్ హోంలో జరిగే సమావేశానికి టైలర్లు చేరుకుంటారని తెలిపారు.

పిల్లలకు ఉచిత వైద్య పరీక్షలు

కై కలూరు: పట్టణంలోని సీతారామ ఫంక్షన్ హాల్లో కొసరాజు వీరయ్య చౌదరి అధ్యక్షతన పిన్నమనేని కోటేశ్వరరావు ఎడ్యుకేషన్, మెడికల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కై కలూరు, ఆటపాక గ్రామాల పిల్లలకు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గుడివాడ ఉమా పిల్లల వైద్యశాల డాక్టర్లు పిన్నమనేని రామకృష్ణప్రసాద్, మాధవి, విజయవాడ అంకుర, రెయిన్‌బో హాస్పిటల్స్ వైద్య సిబ్బంది పిల్లలకు వివిధ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి 'కృష్ణా' బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కోటి రాజీనామా

గుడివాడటౌన్ : టీడీపీ కృష్ణా జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పదవికి గుడివాడకు చెందిన దేవరపల్లి లక్ష్మీకోటయ్య(కోటి) ఆదివారం రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని జిల్లా అధ్యక్షునికి సమర్పించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కోటి విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది రావి అనుచరుల దుర్మార్గ ఆలోచనలు తనకు ఇబ్బంది కలిగించాయని బీసీలకు అగౌరవం కలుగుతోందని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవ ఏర్పాట్లు


రాటాను ఏర్పాటు చేస్తున్న ఈఓ, ధర్మకర్తల మండలి సభ్యులు

ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెం శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవాల ఏర్పాట్లకు ఆదివారం శ్రీకారం చుట్టారు. స్వామివారి కల్యాణోత్సవాలు వచ్చే మార్చి 3 నుంచి 9వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయ చైర్మన్ మీగడ నెలబాలుడు, ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు పాలకవర్గ సభ్యుల పర్యవేక్షణలో ఆలయ పురోహితులు కేటీవీ గోపాలాచార్యులు, జోశ్యుల ఆధ్వర్యంలో రాటను ఏర్పాటు చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో స్థానిక అమృతేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కంతేటి వరలక్ష్మి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి శాంతి కల్యాణం


స్వామి వారికి శాంతి కల్యాణం చేస్తున్న దంపతులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెంసెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శాంతి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం 'కృత్తిక' సందర్భంగా కల్యాణం జరిగింది. ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ ఆధ్వర్యంలో 17 మంది దంపతులు కల్యాణాన్ని మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య, చైర్మన్ శొంఠి నాగరాజు, పాలకవర్గ సభ్యులు ఆనందాసు శివనాగేంద్ర, చింతగుంట నాగలక్ష్మి పర్యవేక్షించారు.

దీవించమ్మా.. గంగానమ్మ


అమ్మవారికి అభిషేకం చేస్తున్న ధర్మకర్త యుగంధరరావు, పండితులు

కోడూరు: భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న కోడూరు గంగాభవాని 11వ పునః ప్రతిష్ఠోత్సవాలను పురస్కరించుకొని మూలమూర్తికి అభిషేకాలు చేశారు. ఆదివారం ఉదయం డప్పువాయిద్యాల నడుమ చిన్న అమ్మవారిని బయటకు తెచ్చి విశేష పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావుతో పాటు మరో 15మంది దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. యర్రారెడ్డివారిపాలెం, ఇస్మాయిల్‌బేగ్‌పేట, కోడూరు, తూర్పువైపు గ్రామాలకు చెందిన మహిళలు ఇంటి వద్ద నుంచే బిందెలతో నీటిని తీసుకు వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ముందుగా ధర్మకర్త దంపతులు పంచామృతాలతో గంగానమ్మ అమ్మవారి మూలమూర్తికి అభిషేకాలు చేసి చల్లగా దీవించాలంటూ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులే స్వయంగా అమ్మవారికి వేలాది బిందెల నీటితో అభిషేకం చేసి భక్తిప్రపత్తులు చాటారు. పండితులు కొమ్మూరి శ్రీనివాసశర్మ యాజ్ఞిక బ్రహ్మగా వ్యవహరించి కార్యక్రమాలను జరిపించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చన, మహాచండియాగానికి సంకల్పం, మండపారాధనను నిర్వహించారు. సోమవారం మహా చండీయాగం, పూర్ణాహుతి, మహా అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు యుగంధరరావు తెలిపారు.

సృజనకు పదును పెట్టేందుకు దోహదం


టెక్నోఫెస్టో ప్రదర్శనను తిలకిస్తున్న ప్రొఫెసర్ జాషువా

రామచంద్రపురం(అవనిగడ్డ): విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు టెక్నోఫెస్టో వంటి కార్యక్రమాలు దోహద పడతాయని హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ జాషువాపాల్ పేర్కొన్నారు. మండల పరిధిలోని రామచంద్రపురం దివిసీమ పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం టెక్నోఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులుపలు ప్రాజెక్టులు ప్రదర్శించారు. రైతులు, సామాన్యులకు ఉపయోగపడే విధంగా ఆటోమేటిక్ నీటి పిచికారీ యంత్రం, మెట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే పరికరం, భూకంపాల హెచ్చరికల అలారం వంటి పరికరాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

60 మంది రక్తదానం


రక్తదానం చేస్తున్న యువకులు

పెనమలూరు: కానూరులో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మాతృహృదయ్ స్వచ్ఛంద్ సేవాసంఘ ఆధ్వర్యంలో డాక్టర్ పిన్నమనేని సుధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ సహకారంతో కానూరు కార్మెల్ చర్చిలో ఫాదర్స్ బాలస్వామి, రాయప్ప, వైద్యులు కె.చక్రవర్తి, జాస్మిన్ సుల్తానా రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 60 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి హిమోగ్లోబిన్, బ్లడ్‌గ్రూప్, బీపీ పరీక్షలు ఉచితంగా చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అన్నే చిట్టిబాబు, సంస్థ ప్రతినిధి తాళ్లూరి అశోక్, వైఎస్సార్ సీపీ నాయకులు హనుమంతరావు, ఖాదర్, తాళ్ల నరేంద్ర, శాంతిరాజు, వీఆర్వో శ్రీనివాసరావు, సీపీఓ నాగేశ్వరరావు, జయరాజ్, పవన్‌చంద్ పాల్గొన్నారు.

రివర్ క్రాస్‌లో సత్తా చాటిన స్విమ్మర్లు


పతకాలు సాధించిన ఈడుపుగల్లు స్విమ్మింగ్ ఫ్యామిలీ

కంకిపాడు: రివర్ క్రాస్ పోటీల్లో ఈడుపుగల్లు స్విమ్మింగ్ ఫ్యామిలీ సత్తా చాటింది. ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం 23వ కృష్ణా రివర్ క్రాస్ కాంపిటేషన్ నిర్వహించారు. ఈ పోటీల్లో ఈడుపుగల్లుకు చెందిన స్విమ్మింగ్ ఫ్యామిలీ బిళ్లా శ్రీనివాసరావు, బిళ్లా మీనా, బిళ్లా హర్షిత, బిళ్లా హర్షశ్రీ పాల్గొని రివర్‌క్రాస్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఒకే కుటుంబం రివర్ క్రాస్‌లో పాల్గొని సత్తా చాటడంతో డీఎస్‌డీఓ ఝాన్సీలక్ష్మి స్విమ్మర్లను అభినందించారు. బిళ్లా శ్రీనివాసరావు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈడుపుగల్లులోని స్విమ్మింగ్ పూల్‌లో తమ కుటుంబం శిక్షణ పొందుతోందని, రివర్ క్రాస్ పూర్తి చేయటం సంతోషంగా ఉందని తెలిపారు.

205 మందికి కళ్లజోళ్ల పంపిణీ



గుడివాడటౌన్(నందివాడ): కుదరవల్లి గ్రామంలో ఆదివారం ఉచిత కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అమెరికాకు చెందిన హోప్ ఫర్ హ్యూమనిటి ఐఎన్‌సీ, మేరీల్యాండ్(యూఎస్ఏ) ఆధ్వర్యంలో పంపిణీ జరిగింది. ఈనెల 13న ఏవీ ఆప్టికల్స్ విజయవాడ వారు నిర్వహించిన కంటి పరీక్ష శిబిరంలో సుమారు 290 మందికి కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు. వారిలో 205 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేసినట్లుగా నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హోప్ ఫర్ హ్యూమనిటీ ప్రెసిడెంట్ వి.కోటేశ్వరరావు, ఫౌండర్ బి.కృష్ణారావు, గ్రామ సర్పంచ్ వసంతల సత్యవతి, వైఎస్సార్ సీపీ నాయకులు వసంతల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి కోరుతూ బైక్ ర్యాలీ



గుడివాడటౌన్: ప్రపంచంలో యుద్ధాలు, భూకంపాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని, ప్రపంచ శాంతి కోరుతూ ఆదివారం స్థానికంగా క్రైస్తవులు బైక్ ర్యాలీ చేశారు. స్థానిక గుడ్‌మెన్‌పేట ఆర్‌సీఎం చర్చి నుంచి సుమారు 50 మంది భక్తులు పెదఅవుటపల్లి జోసఫ్‌తంబి సమాధి వరకు ర్యాలీ నిర్వహించారు.

రాఘవేంద్రస్వామికి ఆవు పాలతో అభిషేకం



మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో వేంచేసి ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి వారి ఆలయ ఆవరణలో ఉపాలయంగా ఉన్న రాఘవేంద్ర స్వామి దేవస్థానంలో స్వామి వారి జన్మదినం సందర్భంగా ఆదివారం 108 లీటర్ల ఆవుపాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ పూజారులు వేద మంత్రోచ్ఛరణలతో క్షీరాభిషేకం చేశారు. అనంతరం స్వామి వారిని పలు పుష్పాలతో అలంకరించారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

కోనేరుసెంటర్: యువకుడి అదృశ్యంపై చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. మచిలీపట్నం ఈడేపల్లికి చెందిన బొల్లా రోహిణి రఘునాథ్ ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల ఓ షాపింగ్ మాల్‌లో ఉద్యోగానికి చేరాడు. శనివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల వెదికినా ప్రయోజనం లేకపోయింది. తల్లి ధనలక్ష్మి తన కుమారుడు కనిపించటంలేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కళాకారిణికి ఆర్థిక సాయం



గుడివాడటౌన్ : కళలకు పుట్టిల్లు గుడివాడకు చెందిన రంగస్థల నటి గొట్టపు శివకుమారికి ఆదివారం చాప్లిన్ కామెడీ క్లబ్ సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల శివకుమారి అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స చేయించుకోవాల్సి రావడంతో గుడివాడకు చెందిన చాప్లిన్ కామెడీ క్లబ్ రూ 5 వేలు, యార్లగడ్డ ఫైన్‌ఆర్ట్స్ వ్యవస్థాపకుడు యార్లగడ్డ సత్యనారాయణ రూ 10 వేలు, మొత్తం 15 వేలు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మట్టా రాజా, శీరం శ్రీనివాసరావు, వంగ శ్రీనివాస్(వంశీ), ఆర్‌వీఎల్ నరసింహారావు, కుంపటి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పామర్రు మండల సచివాలయ కన్వీనర్‌గా 'ముప్పిడి'

పామర్రు: పామర్రు మండలం సచివాలయ కన్వీనర్‌గా ఉరుటూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ముప్పిడి సురేష్‌రెడ్డిని ఆదివారం నియమించినట్లు స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తెలిపారు. సురేష్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

చిత్తశుద్ధితో సమస్యల పరిష్కారం

- కైకలూరు ఎమ్మెల్యే డీఎన్నార్
- తాడినాడలో గడప గడపకు మన ప్రభుత్వం


గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

కై కలూరు (కలిదిండి): గ్రామంలో సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేస్తానని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. వైస్ ఎంపీపీ కూసంపూడి కనకదుర్గారాణి ఆధ్వర్యాన ఆదివారం తాడినాడ గ్రామంలో 176వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. మూడున్నర ఏళ్లలో ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన కుటుంబాలకు కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యుత్ వైర్లు, డ్రెయినేజీ తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు తక్షణం సమస్యలను పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు. ఇతర పార్టీల నుంచి పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే డీఎన్నార్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, వైస్ ఎంపీపీ కట్టా నాగలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షులు సాగి చిన్నబ్బాయిరాజు, మండల పార్టీ అధ్యక్షులు తిరుమాని రమేష్, మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు పాము రవికుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నీలపాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు


వడాలి జెడ్పీహైస్కూల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

ముదినేపల్లి రూరల్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణతే ధ్యేయంగా మండలంలోని జెడ్పీ హైస్కూళ్లలో ప్రత్యేక తరగతులకు శ్రీకారం చుట్టారు. పలు హైస్కూళ్లలో ఉదయం నుంచే ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఆదివారం తెలుగు సబ్జెక్టుపై ప్రత్యేక తరగతులు జరిగాయి. వడాలి జెడ్పీహైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బీఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి 'విజయకేతనం' కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తూ ఆత్మవిశ్వాసం కల్పించడానికి ప్రయత్నిస్తున్నామన్నారు.

ప్రతిభ చూపిన ఫార్మసీ అధ్యాపకురాలు


బహుమతిని అందుకుంటున్న దృశ్యం

గుడ్లవల్లేరు: స్థానిక వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ కాలేజీలో అధ్యాపకురాలు ఎం.చందన ప్రతిభ చాటారు. ఆదివారం తెనాలి ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన జాతీయ సదస్సులో ఆమె సత్తా చాటారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు తెలిపారు. జీలకర్ర విత్తనాల సారంతో సూక్ష్మ జీవుల సంహారక గుణంపై ఈ-పోస్టర్‌ను ప్రదర్శించి ద్వితీయ బహుమతిని సాధించినట్లు పేర్కొన్నారు. బీ ఫార్మసీ మొదటి సంవత్సర విద్యార్థిని ఫర్వీనా సుల్తానా రియల్ వరల్డ్ డేటా ఈవీడెన్స్ అనే అంశంపై పోస్టర్‌ను ప్రదర్శించి ప్రథమ బహుమతిని సాధించినట్లు తెలిపారు. విజేతలను అధ్యాపకులు డాక్టర్ ఎస్‌కే అమీనాబీ, డాక్టర్ పి.రవీష, డాక్టర్ బి.మోహన్‌గాంధీ, డాక్టర్ టి.బాలకృష్ణ తదితరులు అభినందించారు.

ఘనంగా మహంకాళి అమ్మవారి జాతర


ప్రత్యేక అలంకారంలో మహంకాళి అమ్మవారు

కోడూరు: మండలంలోని ఉల్లిపాలెం శివారు హరిపురం గ్రామంలో మహంకాళి అమ్మవారి ప్రధాన గుడిజాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూలమూర్తికి ప్రత్యేక చేశారు. పండితుల మంత్రవచనాల నడుమ అమ్మవారికి వివిధ రకాల జలాలతో అభిషేకాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. డప్పువాయిద్యాల నడుమ గ్రామస్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై చిన్న అమ్మవారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటి వద్ద మహిళలు నీటిని ఓరబోసి తమ భక్తిభావం చాటుకున్నారు. వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో అమ్మవారికి చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. రాత్రికి అమ్మవారి రంగవల్లిని తీర్చిదిద్ది, అన్నం రాశిని సమర్పించారు. గ్రామ యువకులు వీరతాడు, ఖడ్గాలతో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సాగరతీరంలో మెరైన్ గస్తీ


పర్యాటకులకు సూచనలిస్తున్న మెరైన్ సిబ్బంది

కోడూరు: హంసలదీవి సాగరతీరంలో పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు ముమ్మర గస్తీ నిర్వహించారు. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ సుదూర ప్రాంతాలకు చెందిన యాత్రికులు ప్రత్యేక వాహనాల్లో తీరానికి తరలివచ్చారు. వీరంతా సముద్ర అలలు మధ్య కేరింతలు కొడుతూ సందడి చేశారు.

పర్యాటకులకు అసౌకర్యాలు కలగకుండా మెరైన్ సిబ్బంది గస్తీ నిర్వహించారు. యాత్రికులకు సూచనలిస్తూ, సముద్ర స్థితిగతుల గురించి వివరించారు. సాగరసంగమం వద్ద పరిస్థితులు భిన్నంగా ఉండటంతో పర్యాటకులను అక్కడకు అనుమతించలేదు. సీఐ పవన్‌కిశోర్, ఎస్ఐ జిలానీ పర్యవేక్షణలో గస్తీ చేపట్టారు.

నాంచారమ్మ జాతర విజయవంతం చేద్దాం


పెదప్రోలు నాంచారమ్మ ఆలయం వద్ద మాట్లాడుతున్న సీఐ రవికుమార్

పెదప్రోలు(మోపిదేవి): గ్రామస్తుల సహకారంతో జాతర విజయవంతం చేయాలని చల్లపల్లి సీఐ భీమేశ్వర రవికుమార్ అన్నారు. మండల పరిధిలోని పెదప్రోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీఅద్దంకి నాంచారమ్మ తల్లి జాతర మహోత్సవం మార్చి 7వ తేదీ నిర్వహించనున్నారు. అందులో బాగంగా పలు శాఖల అధికారులు, గ్రామస్తులతో ఆలయ ధర్మకర్త కమిటీ చైర్మన్ ఆకుల వెంకట్రామయ్య అధ్యక్షతన కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామస్తులు అధికారులకు పూర్తిగా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు సూచనలు, సలహాలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఆలయ కమిటీ కార్యదర్శి కూరపాటి కోటేశ్వరావు, పీఏసీఎస్ చైర్ పర్సన్ ఆది రాంబాబు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కుర్రా గురుప్రసాద్, మద్దిపట్ల జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ మార్కెటింగ్‌పై ఉచిత శిక్షణ

ఉంగుటూరు: ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో డిజిటల్ మార్కెటింగ్‌పై ఉచిత శిక్షణ తరగతులు మార్చి మొదటి వారంలో ప్రారంభించనున్నట్లు డైరెక్టర్ పరదేశి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు నెలల శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ చదివి 18–35 సంవత్సరాలు కలిగిన యువతి, యువకులు అర్హులని తెలిపారు.